కొని సీలింగు ఫేన్ తెచ్చాను. అక్కయ్య ఎక్కువభాగం గడిపే వంటగదిలో బిగించాము దాన్ని.

ఇంకా తన మాట వింటున్నందుకు అక్కయ్య నన్ను రెండు రోజులపాటు మెచ్చుకుంది.

ఆదివారం ఉదయం చిన్నన్నయ్య ఇంటికి భోజనానికి వెళ్ళాము. డైనింగు టేబిల్‌ముందు చిన్న స్టూల్‌వేసి టేబిల్ ఫేన్ ఒకటి అమర్చింది చిన్నవదిన మాకు, కొద్దిగా గర్వంగా.

“టేబిల్‌ఫేన్ కూడా కొన్నారా?” అడిగింది అక్కయ్య చిన్నవదినని. మొహం కొద్దిగా చిన్నబుచ్చుకొని.

“ఊహు సీలింగుఫేన్ మార్పించి మీ ఇంట్లోలాగే టేబిల్‌ఫేన్ కొనిపించాను. మీ అన్నయ నిన్నటిదాకా నామాట వింటే వట్టు ఈ విషయంలో. పోరగా పోరగా నిన్ననే కొత్తఫేన్ మార్చి తెచ్చారు”

# జోడు

ఆత్మారాంకి మొదటినుంచీ కళ్ళజోడంటే ఎలర్జీ. అదంటే చిన్నప్పుడు ఎందుకో భయంగా వుండేది. కళ్ళజోళ్ళున్నవాళ్ళు ఎత్తుకుంటే దింపేదాకా ఏడ్చేవాడు గుక్కపెట్టి.

తన స్కూల్ ఫైనల్ పరీక్ష రెండోసారికూడా తప్పినప్పుడుగానీ, బ్యాంక్‌లో ఉద్యోగం ఇంటర్వ్యూ లెవెల్‌దాకా వచ్చి తప్పిపోయినప్పుడుగానీ అంతగా బాధపడలేదు. నిజానికి అలాంటి చాలా విషాదాలని సరదాగా తీసుకున్నాడు. స్పోర్టివ్‌స్పిరిట్‌తో. కాని తన పద్దెనిమిదో ఏట కళ్ళజోడు పెట్టుకోవాల్సి వచ్చినప్పుడు మాత్రం విపరీతమయిన మానసికాందోళనకి గురయ్యాడు.

కళ్ళమంటలు అన్నేకాలం భరించలేక, తప్పనిసరై కళ్ళజోడు పెట్టుకోవడం ప్రారంభించాడు. ఆ కళ్ళజోడు ఆత్మారాంకి జీవితాంతం శరీరంలో ఓ భాగంగా గుదిబండలా తయారయి కూర్చుంది వదలకుండా. మైనస్ పాయింట్ ఫైవ్ కాస్తా పెరిగి పెరిగి రెండుసార్లు అద్దాలు మార్చాల్సి వచ్చినప్పుడు ఇంకా బాధ పడ్డాడు.

కళ్ళజోడు లేకుంటే తన ఇరవై మూడో ఏట రాధ తనని ప్రేమించి, వ్యవహారం పెళ్ళిదాకా వెళ్ళివుండచ్చని ఇరవై ఆరో ఏడు వచ్చినా ఇదయిపోతూంటాడు ఆత్మారాం.

రెండవసారి పెళ్ళిచూపులకు వెళ్ళి "నచ్చలేదు" అన్న ముక్క అనిపించుకున్నాడు ఇద్ద రందమైన అమ్మాయిలచేత. అసలు కారణం తను నచ్చకపోవడం కాదనీ, తనతండ్రి కోరిన కట్నం అయివుండవచ్చనే వూహ జనించినా, అది నమ్మబుద్ధికాలేదు.

ఎందుకయినా మంచిదని మూడవసారి పెళ్ళిచూపులకు వెళ్ళేటప్పుడు కళ్ళజోడు తీసి జేబులో పెట్టుకుని మరీ వెళ్ళాడు. తను అద్దాలు వాడుతున్నట్లు పెళ్ళికూతురికి తెలియకుండా ముందే జాగ్రత్తలు తీసుకున్నాడు.

ఆత్మారాం ఆ అమ్మాయికి నచ్చింది అందుకు కారణం తన కళ్ళజోడులేని మొహమే అని నమ్మాడు. ఆత్మారాం తండ్రికి ముందసుగా కట్నం నచ్చింది. దాంతో మాఘంలో పెళ్ళయిపోయింది ఆ యిద్దరికీ.

తన కంటి జబ్బుగురించి తన జీవిత భాగస్వామిగా ఎన్నుకొన్న అమ్మాయికి చెప్పకపోవడం తప్పుగా భావించి, కించిత్ బాధపడ్డాడు ఆత్మారాం. మనసు అనేకమాటలు చెప్పుకుని ఆ బాధని తగ్గించుకున్నాడు.

మొదటిరాత్రి.

తన భార్యని ముట్టుకోబోయేముందు తన చేసిన తప్పిదాన్ని చెప్పి, ఆ అమ్మాయి బాధపడితే వూరడించాలనుకున్నాడు అది న్యాయంగా భావించాడు.

తెలుగు సినిమాలోలా ఆ అమ్మాయి లోపలికి గెంటబడింది. తలుపులు మూసేశారు బయట గడియెట్టేశారు. ఆత్మారాం తెలుగు సినిమాలో లాగే ఆ అమ్మాయి దగ్గరికి నడిచి వెళ్ళాడు. (చేతిలో కళ్ళజోడు పెట్టెతో)

ఆ అమ్మాయి ఆత్మారాం పాదాలమీద వాలిపోయి భారీ డైలాగు చెప్పింది ఒకటి.

"నమ్మకద్రోహం చేశాను మీకు. మీరు నన్ను క్షమించానంటే కాని మీ పాదాలు వదలను"

వంగి మృదువుగా ఆ అమ్మాయిని లేవనెత్తుకున్నాడు ఆత్మారాం. "ఫర్వాలేదు నేను కూడా."

తలెత్తిన ఆ అమ్మాయి మొహానికున్న కళ్ళజోడుని చూడగానే ఆత్మారాంగుండె ఘల్లుమంది.

# పువ్వులు

"అబ్బబ్బబ్బ చస్తున్నాను ఈ మనిషితో వేగలేక. ఏళ్లొస్తున్నాయి ఎందుకు?"

తెల్లబోయి చూసాడు కుచేలరావు భార్యవంక అప్పుడే ఆఫీసు నుంచి తిరిగివచ్చాడు కుచేలరావు. భార్యకి పూలపొట్లం అందించాడు సంతోషపడుతుందనుకున్నాడు. ఎప్పుడయినా పూలుతెస్తే కుచేలరావు భార్య సంతోషపడిపోతుంది. పూలంటే ప్రాణం కాబట్టి.

కుచేలరావు వూహించని విధంగా ఆ పూలపొట్లాన్ని ఓమూల విసిరేసి పై మాటలు అన్నది కుచేలరావు భార్య విసురుగా.

"నీకిష్టమని తెచ్చాను, తప్పేమిటి?" అహం దెబ్బతినగా అన్నాడు కుచేలరావు ఎర్రబడ్డ మొహంతో. ఆఫీసులో చండశాసనుడైన